"ఉత్తిష్టత!జాగ్రత!ప్రాప్యవరాన్నిబోధత"
కలియుగాబ్ది 5121
మాసపత్రిక

# హిందూ నగారా
" ఉత్తిష్టత!జాగ్రత!ప్రాప్యవరాన్నిబోధత"
కలియుగాబ్ది 5121
సంపుటి : 28 ✿ సంచిక : 1 ✿ పేజీలు : 8 ✿ విడిప్రతి : రూ.5.00 ✿ శ్రీ వికారి నామసంవత్సరం : పుష్య మాసం : 01-01-2020

## CAA కు మద్దతు ప్రకటించిన 1100 మంది ప్రొఫెసర్లు



**ముస్లిం మత గురువు మౌలానా కాల్బే జావేద్ మద్దతు**

**షియా** ముస్లిం మత గురువు మౌలానా కాల్బే జావెద్ సీఏఏకు మద్దతు తెలిపారు. ముస్లింలు ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని సీఏఏ, ఎన్ఆర్సీ రెండూ వేర్వేరు అని తెలిపారు. ఎన్ఆర్సీ ప్రస్తుతం అసోంలో మాత్రమే అమలు అవుతోందని దేశవ్యాప్తంగా కాదని తెలిపారు. "దీనిపై పార్టీలు ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నాయి. ముస్లింలు సంయమనం పాటించాలని కోరుతున్నా" అని ఆయన అన్నారు.

**1100ల మంది ప్రొఫెసర్ల మద్దతు**

మరోవైపు దేశవ్యాప్తంగా ఉన్న 1100 మంది ప్రొఫెసర్లు సీఏఏకు మద్దతుగా ప్రకటన విడుదల చేశారు. పౌరసత్వ సవరణ చట్టాన్ని తాము సమర్థిస్తున్నట్టు తెలిపారు. పలు యూనివర్శిటీల అధ్యాపకులు, యూజీసీ సభ్యులు ఆ ప్రకటనపై సంతకాలు చేశారు. అంతేకాకుండా వ్యతిరేకంగా పోరాటం చేస్తున్న వారిపై ప్రశ్నల వర్షాన్ని కురిపించారు. "పాకిస్థాన్, బంగ్లాదేశ్, ఆఫ్ఘనిస్థాన్ దేశాల్లో మైనారిటీలుగా ఉన్న వారిని ఆదరిస్తే తప్పేంటి?" అని ప్రశ్నించారు. పౌరసత్వ సవరణ చట్టం బిల్లు ప్రవేశపెట్టిన ప్రభుత్వాన్ని, బిల్లును ఆమోదించిన పార్లమెంటును అభినందించారు. నిజా నిజాలు ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలని మేధావులు సూచించారు. ★

## సర్వజన హితమే హిందూత్వం– డా॥ మోహన్ భాగవత్


**"సంఘ్** కోరుకునేది ధర్మవిజయం. ధర్మ విజయమంటే సాత్విక శక్తుల జయం. అది అందరి శ్రేయస్సును, ఉన్నతిని సాధిస్తుంది. ఇలాంటి విజయాన్ని సాధించడం కోసం స్వయంసేవకులు తీసుకున్న సంకల్పమే విజయ సంకల్పం" అని రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ సర్ సంఘచాలక్ డా. మోహన్ భాగవత్ అన్నారు. ఇబ్రహీంపట్నంలో జరిగిన మూడురోజుల విజయసంకల్ప శిబిరంలో భాగంగా సరూర్ నగర్ ఇండోర్ స్టేడియంలో జరిగిన సార్వజనిక సభలో ఆయన మాట్లాడారు.

స్వార్ధంతో నీతినియమాలను మరచి తమ మేలు మాత్రమే కోరుకునేది ఆసురీ ప్రవృత్తి అని, వారు సాధించదలచేది అసురీ విజయమని ఆయన అన్నారు. దీని వల్ల సర్వత్రా విధ్వంసం మాత్రమే జరుగుతుందని



2వ పేజీ చూడండి...

## ప్రేరణాత్మకం సేవా సంగమం




డిసెంబర్ 7, 8 తారీఖులలో విజయవాడలోని సిద్ధార్థ నగర్ లో గల సిద్ధార్థ అకాడమీ నందు సేవాభారతి ఆధ్వర్యంలో 'సేవా సంగమం' జరిగింది. ప్రతి ఐదు సంవత్సరాలకు ఒకసారి సేవా భారతి రాష్ట్ర మరియు అఖిలభారత స్థాయిలలో " సేవా సంగమం" (స్వచ్ఛంద సేవా సంస్థల సమ్మేళనము) జరుగుతూ ఉంటుంది. అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న సమాజంలోని అనేకమంది వ్యక్తులు, సంస్థలన్నిటినీ ఒక చోట కలిపి వారి అనుభవాలను పంచుకుని, వారితో

4వ పేజీ చూడండి...

1వ పేజీ తరువాయి...

## సర్వజన హితమే

అన్నారు. అలాగే కీర్తిప్రతిష్ఠల కోసం, అధికారం కోసం ప్రయత్నించేది రాజసిక విజయమని, అది పూర్తి స్వార్థపూరితమైనదని డా. మోహన్ భాగవత్ అన్నారు. వీటన్నిటికంటే ధర్మవిజయమే ఉత్తమమైనది. ఎందుకంటే ఇలాంటి విజయం కోసం కృషి చేసే వ్యక్తులు ఎంతటి వ్యతిరేకత ఉన్నప్పటికీ అందరి మేలు కోసమే పనిచేస్తారు. ఎవరో వచ్చి దేశ ప్రగతిని, హితాన్ని సాధిస్తారని ఆశించరాదని, అందరూ కలిసి ఆ కార్యాన్ని సాధించడానికి కృషి చేయవలసిందేనని డా. భాగవత్ అన్నారు. సర్వ సృష్టి ఆ పరమాత్మ నుంచి వచ్చింది కాబట్టి అందరిపట్ల సమాన భావాన్ని కలిగిఉండడమే హిందూ లేదా భారతీయ దృక్పథం. ఈ దేశంలో పరంపరానుగతంగా ఇదే కనిపిస్తుందని, ఇక్కడ స్వేచ్ఛ, స్వాతంత్ర్యం ఉంటాయి కానీ అరాచకత్వం, విశృంఖలత్వం ఉండవని ఆయన అన్నారు. సమాజంలో సాధారణ ప్రజానీకం కొందరు శ్రేష్ఠ వ్యక్తులను అనుసరిస్తారు. వీరినే రవీంద్రనాథ్ ఠాగూర్ నాయక్ అన్నారని, ఏకత్వ సాధనే మన సమాజ లక్షణమని, సమాజ పరివర్తనతోనే ఉద్ధరణ, ఉన్నతి సాధ్యపడతాయని డా. మోహన్ భాగవత్ అన్నారు. అది కూడా హిందూ మార్గం, ద ృక్పథం ద్వారానే సాధ్యపడుతుందని ఠాగూర్ అన్నారని వివరించారు. ఈ దేశాన్ని తన మాతృభూమిగా తలచి ఇక్కడి సంస్కృతిని ఆచరించేవాడు, సర్వ సృష్టిని ఒకటిగా భావించేవాడు హిందువని, అలాంటి హిందువులను కలపడమే సంఘ కార్యమని, ఆ కార్య సాధనకు, ధర్మ విజయానికి స్వయంసేవకులు కృషి చేస్తారని డా. మోహన్ భాగవత్ అన్నారు. మొత్తం సమాజాన్ని కలుపుకుని దేశ ఉన్నతి కోసం సంఘ 90ఏళ్లుగా పనిచేస్తోందని అన్నారు.

8వేలమంది స్వయంసేవకుల యోగాసన ప్రదర్శన, ఇతర సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ ఆకట్టుకున్నాయి. అంతకుముందు పురవీధుల్లో స్వయంసేవకుల పథసంచలన్ (రూట్ మార్చ్) శోభాయమానంగా సాగింది. ★

## మందుపాతరలను పాతరేసిన రాణే

ప్రేరణ



స్థానిక గిరిజనులను రెచ్చగొట్టి జమ్మూకాశ్మీర్ ను కైవసం చేసుకోవాలనే తలంపుతో పాకిస్థాన్ 1948లో కాశ్మీర్లోని నౌషేరా, రాజౌరి మధ్య ప్రాంతంలోకి ఏప్రిల్ లో తన సైన్యాన్ని దింపింది.

21వ భారత యుద్ధ ట్యాంకుల దళం రాజౌరీ పై దాడి చేసి పాక్ సైనికులను రాజౌరీ నుండి తరిమికొట్టాలని నిర్ణయం అయింది. అనుకున్న ప్రకారం ప్రయాణం సాగుతుండగా అకస్మాత్తుగా పాకిస్థాన్ సైనికులు మెషిన్ గన్ దాడిని ప్రారంభించారు. మెషిన్ గన్ వల్ల యుద్ధ ట్యాంక్ లో ఉన్నవారికి ఎలాంటి అపాయం లేదు. ట్యాంకు చెక్కు చెదరదు. కనుక దిగులు లేదు. కానీ పాక్ ఈ దాడిని ఎందుకు ప్రారంభించింది? భారత ట్యాంకుల దళ ఇంజనీర్ విభాగంలో ఉన్న కమాండింగ్ ఆఫీసర్ రామ్ రాఘోబా రాణే మనసు కీడు శంకించింది.

కర్ణాటక రాష్ట్రంలోని సింధియా గ్రామంలో 1918 జూన్ 26న జన్మించిన రామ్ రఘోబా రాణే తండ్రి పోలీస్ కానిస్టేబుల్. రాణే 22 ఏళ్ళ వయసులో సైన్యంలో చేరి బ్రిటిష్ తరపున రెండవ ప్రపంచ యుద్ధంలో పాల్గొని అనుభవము, యుద్ధ పాటవానికి ప్రశంసలతో పాటు పదోన్నతినీ పొందారు. అప్పుడు ఆయన ఇంజనీరింగ్ విభాగంలో ఉన్నారు. ట్యాంకులకు దారి కల్పించడం, మధ్యలో వచ్చే అవరోధాలను తొలగించడం ఆయన విధులు.

పాక్ సైనికులు మెషిన్ గన్ కాల్పులతో మన దృష్టి మరల్చాలని ప్రయత్నిస్తున్నారు అంటే తప్పకుండా మరో వ్యూహం ఉండాలి. అదేమిటో కనిపెట్టాలని నిశ్చయించుకున్న రాణే వైర్లెస్ సెట్ లో మిగతా సహచర ట్యాంకు డ్రైవర్లను హెచ్చరించి, ఎక్కడి వారిని అక్కడ ఆపేసి తాను తన ట్యాంకర్ నుండి కిందకు దిగారు. శత్రువులు వెంటనే కాల్పులు ప్రారంభించారు. రాణే వెంటనే నేలపై బొక్క బోర్లా పడుకుని పాకుతూ ఆ ప్రదేశాన్ని పరిశీలించాడు. మొత్తం అంతటా మందుపాతరలు అమర్చి ఉన్నాయి. అధిగమించడానికి తగిన ఉపాయం తట్టగానే తన ట్యాంక్ లోకి చేరి సహచరులకు పరిస్థితుల్ని వివరించాడు. రాణే ఉపాయం ప్రకారం తను ట్యాంక్ కింద పాకుతూ దారిలో ఉన్న మందుపాతరలు తొలగించాలి. మిగిలిన ట్యాంకులన్నీ ఒకే వరసలో ఒకరి వెనుక ఒక్కరు రావాలి. “మతి పోయిందా? నువ్వు మందు పాతర తొలగించేలోగా నిన్ను మెషిన్ గన్ తో కాల్చేస్తారు. వద్దు”అన్నాడు కమాండర్. ‘మీకు దారి ఏర్పాటు చేయడం నా కర్తవ్యం. కంగారు వద్దు. నేను బొక్కబోర్లా నేలపై పడుకుని పని పూర్తి చేస్తాను. ఆ కోణంలో కాల్చడం కష్టం’ అన్నాడు రాణే. “నువ్వు మందు పాతర తొలగించినట్లు మాకెలా తెలుస్తుంది?”అన్నాడు కమాండర్. మొదటి ట్యాంకు డ్రైవర్ సీటు వద్దనుండి కుడిఎడమలలో రెండు తాళ్లు కడతాను. అవి బయట నా దగ్గరగా వేలాడుతూ ఉంటాయి. నేను వెళ్లి ట్యాంకు ఎదురుగా నేలపై బొక్క బోర్లా పడుకుని పాకుతూ ఉంటాను. ట్యాంకు దారిలో మందు పాతర ఉంటే కుడివైపు తాడు తాగుతాను. అంటే ఆగమని సంకేతం. మందుపాతరలు నిర్వీర్యం చేశాక ఎడమవైపు తాడు లాగుతాను. అంటే ముందుకు కదలమని సంకేతం. ఇది చెప్పడానికి, వినడానికి బాగానే ఉన్నా ఆచరణలో చాలా కష్టం. ట్యాంకు కింద పాకుతూ ముందుకు సాగేటప్పుడు ఏ మాత్రం ఏమరుపాటుగా ఉన్నా, లేదా ట్యాంకు కదిలే వేగానికి రాణే కదిలే వేగానికి సమన్వయం కుదరకపోయినా, ట్యాంకు ఇనుప బెల్ట్ ల మధ్య కాకుండా బెల్ట్ క్రిందికి వచ్చేసినా రాణేకి ప్రాణాపాయం తప్పదు. కానీ రోమాంఛితమైన ఈ సాహస యాత్రను దిగ్విజయంగా పూర్తి చేశాడు రాణే.

ట్యాంకులకింద పాకుతూ, దారిలోని మందుపాతరలను నిర్వీర్యం చేస్తూ, కదలమని ఒక్కొక్క ట్యాంకుకు సంకేతం ఇస్తుండగా భారత యుద్ధ ట్యాంకులన్నీ ఒకదాని వెంట ఒకటి మందుపాతరల ప్రదేశం దాటుకుని క్షేమంగా గమ్యాన్ని చేరుకున్నాయి. ట్యాంకులు తమ మీదకి రావడం చూసిన పాక్ సైనికులు మిషన్ గన్స్ వదిలేసి పారిపోయారు. ఈ ఆపరేషన్ కోసం పని చేసిన ఇంజనీర్లకు ‘బాటిల్ ఆనర్ ఆఫ్ రాజౌరి’ పురస్కారాన్ని, రామ్ రాఘోబా రాణేకు ‘పరమవీరచక్ర’ను బహూకరించారు. ★

# వీళ్ళా మన మేధావులు?

సంపాదకుని నగారా

పౌరసత్వ సవరణ చట్ట వ్యతిరేక ప్రదర్శనల ముసుగులో దేశంలో హింసాత్మక ఉద్యమాన్ని ప్రేరేపించాయి ప్రతిపక్షాలు. ఆ ఉద్యమ తీవ్రత ఏ ప్రాంతాలలో ఉన్నది, రాళ్లు విసురుతున్న ఆయా వర్గాల వారి దుస్తులు, వారి నినాదాలను బట్టి ఆ ఉద్యమం వెనక ఉన్నది ఎవరన్నది ఇట్టే తెలిసిపోతుంది. ఇటువంటి హింసాత్మక సంఘటనలు ఆ వర్గం వారికి కొత్త కాదు. కానీ కొందరు మేధావులు ఆ వర్గాల వారి హింసకు మద్దతుగా వీధుల్లోకి రావడం వెనుక ఉన్న కుట్ర ఏమిటో తేల్చాల్సి ఉంది.

ప్రజాస్వామ్యంలో అసమ్మతి అవసరమే. కానీ ఆ అసమ్మతి ప్రజాస్వామ్యబద్ధంగా సాగాలి. ప్రజాస్వామ్యంలో హింసకు తావు లేదు. కానీ ఉద్యమం ముసుగులో జరుగుతున్న హింసను ప్రతిపక్షాలు, మేధావులు ఖండించకపోగా ఆ హింసను ప్రేరేపించే వర్గాలకు అండగా నిలవటం ఆశ్చర్యకరం. దున్న ఈనిందంటే దూడను కట్టేయమనే రీతిలో ఆయా వర్గాలకు ఏదో అన్యాయం జరిగి పోతోందని మేధావులు రోడ్లు ఎక్కడం విచిత్రం. ఇటువంటి వారినా మనం ఇన్నాళ్ళూ మేధావులుగా పరిగణించింది?

జాతి ప్రయోజనాలు ఏమాత్రం పట్టని రీతిలో హింసాత్మక ఉద్యమం సబబే అంటున్నారీ మేధావులు. "విదేశాలలో భారత ప్రతిష్ఠ మంటగలసినా ఫరవాలేదు మా ఓటు బ్యాంకు వర్గాలకు అండగా నిలుస్తాం" అంటున్నాయి రాజకీయ పార్టీలు.

అసలు ఈ ఉద్యమానికి మూలం ఏమిటి? ఉద్యమకారులు చెబుతున్నది తాజాగా తెచ్చిన పౌరసత్వ సవరణ చట్టం (సి ఎ ఏ) ని వ్యతిరేకిస్తున్నామని. అసలు ఆ చట్టంలో ఏముందో మేధావి వర్గంతో సహా ఎవరైనా చదివారా? చదివితే ఏం అర్థమైంది?

కొత్త చట్టం భారతీయ పౌరులు ఎవరికైనా నష్టం కలిగించేదా? ఎవరి పౌరసత్వాన్నయినా తొలగించేందుకు ఉద్దేశించినదా? అంటే కానేకాదు.

కేవలం మన పొరుగున ఉన్న దేశాలలో నివసించే మైనారిటీ మత వర్గాలు అక్కడి మెజారిటీ మతస్థుల చేతిలో వేధింపులకు గురవుతుంటే అటువంటి వారికి భారతదేశపు పౌరసత్వం ఇవ్వటానికి ఉద్దేశించినది. అది కూడా కొన్ని నిబంధనలకు లోబడి మాత్రమే.

మన పొరుగున ఉన్న బంగ్లాదేశ్, పాకిస్థాన్, ఆఫ్ఘనిస్థాన్ లు మూడూ ఇస్లామిక్ దేశాలు. ఆ దేశాల్లో ఉన్న ముస్లిమేతరులందరి మీదా తీవ్రమైన దాడులు జరుగుతున్నాయి. హిందూ బాలికలను ఎత్తుకెళ్లి, బలవంతంగా మతం మార్చి, పెళ్లి చేసుకుంటున్న సంఘటనలు పాకిస్థాన్లో నిత్యం జరుగుతున్నాయి. బంగ్లాదేశ్లో ముస్లిమేతరుల ఊచకోత కొనసాగుతున్నది. ఆఫ్ఘనిస్థాన్లో సిక్కులు బ్రతకలేని వాతావరణం. అటువంటి వారు భారతదేశాన్ని తమ మాతృ దేశంగా భావించి ఇక్కడకు వస్తున్నారు. అక్రమంగానే కొందరు వచ్చారు కూడా. అటువంటివారిని గుర్తించి వారికి భారతదేశంలో ఆశ్రయమివ్వాలనుకోవటం, అదీ కొన్ని నిబంధనలకు లోబడి పౌరసత్వం ఇస్తామనడంలో తప్పు ఏమిటో మన దేశ మేధావులు చెప్పాలి.

చట్టంలో ఆయా దేశాలలోని 'అల్ప సంఖ్యాక వర్గాల వారికి' అని ప్రత్యేకంగా పేర్కొన్నప్పుడు ముస్లింలకు పౌరసత్వ సౌకర్యం ఇవ్వాలని కోరడంలో అర్థం ఏమిటి? పాకిస్థాన్లోని ముస్లింలలో ఎవరిని పడితే వారిని భారతదేశంలోకి ఆహ్వానించాలనుకుంటున్నారా? అంటే హాఫీజ్ సయీద్ లాంటి తీవ్రవాదులు, కసబ్ వంటి కరుడుగట్టిన ఉగ్రవాదులను భారత్లో స్వాగతించాలా? ఇదేమైనా సబబైన డిమాండా?

పాకిస్థాన్, బంగ్లాదేశ్ లోని ముస్లింలకు అనుగుణంగా చట్టం లేదని మన దేశంలోని రైళ్లు, బస్సులు ఎవరైనా తగలబెట్టుకుంటారా? కోరి శత్రువులను ఇంటికి పిలుచుకుంటారా? పాముకు పాలుపోసినా అది కృతజ్ఞత మరచి కాటు వేయక మానునా? అటువంటి విష నాగులను మించిన ప్రమాదకారులు ఆ మూడు దేశాలలోని ఇస్లామిక్ తీవ్రవాదులు. అటువంటి నరహంతకులకు భారతదేశంలోకి ప్రవేశం కల్పించకపోవడం వివక్ష అని మేధావులు ఎలా అనగలనుతున్నారు?

ఈ దేశం శాంతి సౌభాగ్యాలతో సుభిక్షంగా ఉండడం ఇష్టం లేదా? జామియా మిలియా విశ్వవిద్యాలయ ప్రాంగణంలోకి పోలీసులు ప్రవేశించడాన్ని వ్యతిరేకించే వర్గాలు భారతదేశంలోకి మాత్రం ఎవరు వచ్చినా స్వాగతించాలనటం వారి జాతి వ్యతిరేక భావనను బహిర్గతం చేస్తున్నది.

హిందూ సమాజం మేల్కొనాలి. మన సమాజంలో చీడ పురుగులుగా తయారైన వర్గాల కుట్రలను బహిర్గతం చేసే ఉద్యమంలో అందరం భాగస్వాములవ్వాలి.

★

## కలం నగారా

ఇప్పుడెందుకు ఏడుస్తారు?
గడ్డాలొచ్చిన బిడ్డలు గాడి తప్పారని ఇప్పుడెందుకేడుస్తారు?
పసిడి పొత్తిళ్ళలో నీతి కథలు చెప్పారా? నైతిక విలువలు నేర్పారా?
పదహారేళ్ళకే ఆండ్రాయిడ్ ఫోనెందుకని ప్రశ్నించారా?
అందులో ఏమి చూస్తున్నారో, ఏమేమి చేస్తున్నారో గమనించారా?
వారి కాలేజి గడపెక్కారా? చదువుల తీరును ఆరా తీశారా?
స్నేహించే సావాసాలను, సంచరించే స్థలాలను ఎప్పుడైనా చూశారా?
పిల్లల్లో పెరుగుతున్న ప్రేమ రాహిత్యాన్ని పసిగట్టారా?
కాసింత కాలాన్ని ప్రేమతో వారికోసం వెచ్చించారా?
ఎంత కావాలన్నారు గానీ ఏమి కావాలని ఏనాడైనా అడిగారా?
వారి మనసులోని మాటలను మనసెట్టి ఓ సారైనా విన్నారా?
ఇప్పుడెందుకేడుస్తారు? పుణ్య కాలం కాస్తా గడిచిపోయాక!

– సురేంద్ర రొద్ద.

*1వ పేజీ తరువాయి...*

## ప్రేరణాత్మకం సేవా సంగమం...

కలిసి సంస్థ యొక్క సామర్థ్యాన్ని పెంపొందించుకోవడానికి, అలాగే రాష్ట్ర వ్యాప్తంగా సుమారు పదమూడు వందల సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్న సేవాభారతి అనుభవాలను వారికి వివరించి మార్గదర్శనం చేయడానికి ఈ కార్యక్రమాన్ని రూపొందించారు.

మొదటి రోజు కార్యక్రమంలో రాష్ట్ర గవర్నర్ శ్రీ బిశ్వభూషణ్ హరిచందన్, కాకినాడ శ్రీ పీఠం సంస్థాపకులు శ్రీ శ్రీ శ్రీ పరిపూర్ణానంద స్వామి, ఆర్ ఎస్ ఎస్ అఖిలభారత సేవా ప్రముఖ శ్రీ పరాగ్ అభ్యంకర్, ఆర్ ఎస్ ఎస్ క్షేత్ర ప్రచారక్ శ్రీ ఆలె శ్యాం కుమార్, సేవా భారతి రాష్ట్ర అధ్యక్షులు శ్రీ కె. ఎస్. ఎన్. చారి, సేవా భారతి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీ శ్రావణ్ కుమార్, సేవా సంఘం ఆహ్వాన సమితి సభ్యులు శ్రీ తొండేపి హనుమంతరావు, డాక్టర్ చదలవాడ సుధలు పాల్గొన్నారు.

**రెండవ రోజు**

సేవా సంగమం రెండవ రోజు ప్రారంభ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా నూజివీడు సీడ్స్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ శ్రీ మండవ ప్రభాకర్, విశిష్ట అతిథిగా రిటైర్డ్ కమాండర్ శ్రీ వేట కొమ్మ కృష్ణ, రాష్ట్రీయ సేవా భారతి ప్రధాన కార్యదర్శి శ్రీ శ్రావణ్ కుమార్ , ఆర్ ఎస్ ఎస్ ఆంధ్ర ప్రదేశ్ సహ ప్రాంత సేవా ప్రముఖ్ శ్రీ కొండా రెడ్డి లు పాల్గొన్నారు. ఆర్ ఎస్ ఎస్ ఆంధ్ర ప్రదేశ్ సహ ప్రాంత ప్రచారక్ శ్రీ విజయాదిత్య ముఖ్య వక్తగా పాల్గొని ప్రసంగించారు.

రెండవ కాలాంశంలో విజయవాడకు చెందిన ప్రముఖ సామాజిక కార్యకర్త శ్రీ చలసాని బలరామయ్య, రాష్ట్రీయ సేవాభారతి సభ్యురాలు శ్రీమతి చంద్రికా చౌహాన్, RAISE సంస్థ నిర్వాహకులు శ్రీ సత్య గోపాల్ రెడ్డి తదితరులు సేవా కార్యంలో తమ అనుభవాలను వివరించారు. చివర్లో ముఖ్య వక్త, ఆర్ ఎస్ ఎస్ ఆంధ్ర ప్రదేశ్ సహ ప్రాంత కార్యవాహ శ్రీ యుగంధర్ ప్రసంగించారు.

అనంతరం సాయంత్రం జరిగిన ముగింపు కార్యక్రమంలో రాష్ట్రీయ సేవా భారతి ప్రధాన కార్యదర్శి శ్రీ శ్రావణ్ కుమార్, క్షేత్ర సేవా ప్రముఖ్ శ్రీ ఎక్కా చంద్రశేఖర్ లు పాల్గొని ప్రసంగించారు.

రాష్ట్రంలోని వివిధ సేవాసంస్థలు, కార్యక్రమాల నిర్వాహకులు ఈ కార్యక్రమంలో పాల్గొని తమ అనుభవాలను వివరించారు. అలాగే వివిధ సేవా సంస్థల ప్రతినిధులను సేవాసంగమం నిర్వాహకులు సత్కరించారు. ఈ సేవా సంగమంలో అనేక స్టాల్స్, చిత్ర ప్రదర్శనలు ఆకర్షణగా నిలిచాయి.

★

---

*నారీ నగారా*

## ప్రేమగా జీహాద్ కోరల్లోకి

*ఆంగ్లమూలం: రతి హెగ్డే- తెలుగు అనువాదం: శ్రీమతి రేఖ, విజయవాడ.*




**ప్రేమ** పేరుతో ఇస్లాం మతమార్పిడికి పాల్పడే లవ్ జిహాద్ దాష్టీకాలు ఇంకా చాలా చోట్ల చోటుచేసుకుంటూనే ఉన్నాయి. హిందూ అమ్మాయిలను వలలో వేసుకుని నానా హింసలకు గురి చేస్తున్న అనేక సంఘటనల్లో కొన్ని బయట పడుతున్నాయి. మరికొన్ని గోప్యంగా ఉండిపోతున్నాయి. ఇటువంటి ఘటనలు తన దృష్టికి వస్తూఉంటాయని వాటి పట్ల అందరికీ అవగాహన ఉండాలని ముంబైకి చెందిన సామాజిక కార్యకర్త రాతీ హెగ్డే లవ్ జిహాద్ కుయుక్తుల గురించి వివరించారు.

- మా వద్దకు వచ్చే ప్రతి అయిదు కేసుల్లో ఒకరు దిగువ కులాలకు చెందిన వారే.
- వయసుతో సంబంధం లేకుండా అన్ని వయస్సుల వారు 'జిహాద్' వలలో చిక్కుకుంటున్నారు. ఇద్దరు 14, 16 ఏళ్ల పిల్లలున్న వితంతువు కూడా ఈ ఉచ్చులో పడ్డారు.
- దాదాపు అన్ని కేసుల్లోనూ ముస్లిం యువకుడు అమ్మాయిని బైక్ రైడ్ కి తీసుకెళ్లి 'స్వేచ్ఛ' అంటే ఇదే అని బోధలు చేయడంతో ప్రారంభం అవుతుంది.

*5వ పేజీ చూడండి...*

4వ పేజీ తరువాయి...

## ప్రేమగా జీహాద్ కోరల్లోకి...

- అమ్మాయిలను ఆకర్షించే మార్గాలను ముందుగా ముస్లిం అబ్బాయిలకు శిక్షణ కూడా ఇస్తారు. అమ్మాయిలను శారీరకంగా, మానసికంగా కూడా ఆకర్షించే విద్యలన్నీ ముందుగా తెలుసుకుంటారు.
- స్నేహపూర్వక ఆలింగనం, చేతులు కలుపుకోవడంతో ప్రారంభిస్తారు ముస్లిం అబ్బాయిలు. శరీర భాగాలను స్పృశిస్తూ, 'పొరపాటు'న జరిగింది అంటూ మాట మారుస్తూ చాలా ముందుకు వెళ్తారు.
- 10, 12వ తరగతులకు చెందిన యువతులు బాగా ఒత్తిళ్లలో ఉండే క్షణాలు, వారి హావభావాలను చూసి ముద్దులు పెట్టే వరకు చొరవ తీసుకుంటారు. గోప్యంగా ఆ చేష్టలను వీడియోలుగా తీస్తారు.
- ఇంత జరుగుతున్నా చాల మంది తల్లిదండ్రులకు అసలు విషయం తెలిసే సరికి అవ్వాల్సిందంతా అయిపోతుంది.
- ఈ సంబంధాల నుండి బయటకు రమ్మని తల్లిదండ్రులు ఒత్తిళ్లు తెస్తే యువతులను ఇంట్లో నుండి బయటకు వచ్చేలా చేస్తారు ముస్లిం యువకులు. అదీ కాకపోతే చివరిగా వీడియోలు చూపెట్టి భయపెట్టి యువతులను తమ ఆధీనంలో ఉంచుకుంటారు. అప్పటికి కానీ తెలియదు ఆ అమ్మాయిలకు ఇవన్నీ వీడియోలో ఉన్నాయని.
- ఒకవేళ అమ్మాయి ఆ అబ్బాయి నుండి విడిపోవడానికి గట్టిగా నిశ్చయానికి వచ్చినా, యువకుడు తమ స్నేహితుల సహాయంతోనూ ఆ అమ్మాయిని బ్లాక్ మెయిల్ చేస్తాడు. అయితే ప్రతి సారీ ఆ అబ్బాయి.. ఆ అమ్మాయిని పెళ్లి చేసుకుంటాననే చెబుతుంటాడు.
- అమ్మాయి 18 ఏళ్ల వయసు వచ్చే వరకు పెళ్లి గురించి పెద్దగా ఒత్తిడి తేక పోయినా ఆ తర్వాత అమ్మాయిని మానసికంగా తెలియకుండా తీవ్ర ఒత్తిడికి గురిచేసి తాను చెప్పే విధంగా మసలుకునేలా చేస్తాడు.
- సరిగ్గా ఈ బలహీన సమయంలోనే పెళ్లిళ్లు జరిగే సందర్భాలు ఎక్కువ. పెళ్లి చేసుకున్నాక అమ్మాయి మతమార్పిడి జరుగుతుంది. 6 నెలల వరకు అంతా సాఫీగానే సాగిపోతుంది. అసలు వేధింపు అప్పుడు ప్రారంభం అవుతుంది. మొదట కొడుతూ ఉంటాడు. తర్వాత ఇంకా వేధింపులు ఎక్కువవుతాయి. గర్భవతిని చేయడం అబార్షన్ చేయించడం ఇలా పదే పదే చేస్తాడు.
- ఈ సంబంధం ఇలా కొనసాగిస్తూనే మరో రెండేళ్లకు ఆ ముస్లిం వ్యక్తి మరో అమ్మాయిని పెళ్లి చేసుకుంటాడు.
- ఇంకా జుగుప్సాకరం ఏమిటంటే రెండో పెళ్లిని వ్యతిరేకించే మొదటి అమ్మాయి మరీ ఎదురు తిరిగితే భర్త తండ్రి, సోదరులే ఆ అమ్మాయిని శారీరకంగా అనుభవించిన నీచమైన సంఘటనలు కూడా చాలా ఉన్నాయి. ఇంట్లో అత్త, ఆడపడుచులు రోజూ చిత్రహింసలకు గురి చేస్తారు.
- ఒకవేళ మాట్లాడుకునే పరిస్థితి ఉంటె పోలీసులు, ఆ ఇంట్లో వారి సమీప బంధువులు ఆ అమ్మాయిని సర్దుకుపొమ్మని చెప్పడం ఆశ్చర్యం కలిగిస్తుంది.
- అమ్మాయి ఇంకా గట్టిగా వారందరినీ వ్యతిరేకిస్తే, మొబైల్ ఫోన్ కూడా అందుబాటులో లేకుండా హౌస్ అరెస్ట్ చేస్తారు ఆ ఇంట్లో వారు.
- చివరికి ఆ అమ్మాయి ఇంట్లో నుండి ఎలాగో ఒకలా బయట పడితే పిల్లల్ని మాత్రం అమ్మాయికి దక్కనివ్వరు. ఇద్దరు ముగ్గురు పిల్లలుంటే, ఒక బిడ్డని మాత్రమే అమ్మాయి కస్టడీకి ఇస్తారు.
- ఒక వేళ న్యాయస్థానాన్ని ఆశ్రయించి అమ్మాయి న్యాయం పొందినా భరణం మాత్రం చెల్లించకుండా అబ్బాయి తప్పించుకుంటాడు. వీరిది చాలా అనైతికమైన వివాహ బంధం. పెళ్లి జరిగిన తర్వాత అమ్మాయి మతమార్పిడి జరుగుతుంది కాబట్టి తన ఆస్తిపై ఎటువంటి హక్కు ఆమెకు ఉండదని మూర్ఖంగా ఆ హిందూ మహిళను రోడ్డున పడేలా చేస్తారు.

**తస్మాత్ జాగ్రత్త.... లవ్ జీహాద్ పేరుతో జరిగే ఇటువంటి ఆగడాలు అందరికీ తెలియాలి. ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా అప్రమత్తంగా ఉండాలి .** ★

## నెలకో పద్యం

**దేశ భాషలెన్ని తెలిసియున్ననుగాని**
**మాతృభాష రాక మసలలేడు**
**తల్లి లేని కొరత దాదుల తీరునా?**
**రమ్య సుగుణ సాంద్ర రామచంద్ర ॥**

భావం: ఎన్ని భాషలు తెలిసినవాడైనా మాతృ భాష రాకపోతే మనుగడ సాగించలేడు. తల్లి లేని కొరత మారు తల్లులతో తీరుతుందా? మాతృభాష తల్లి వంటిదని భావము.

## మంచిమాట



పిల్లల మనస్సులను జాతీయ భావాలతో నింపాలి. జాతీయ భావనను అనుక్షణము వారి ముందుంచాలి. దేశభక్తిని, వారిని ఉత్తమ పౌరులుగా చేసే మంచి లక్షణాలను వారి బాల్యం నుంచే బోధించాలి.

– యోగి అరవింద.




# మాకొద్దీ అన్యమతం

**రాష్ట్రంలో** అన్య మత ప్రచారం ఎక్కువైపోతోందంటూ ఒక వైపు హిందూ ధార్మిక సంస్థలు, ప్రతిపక్షాలూ గగ్గోలు పెడుతున్న తరుణంలో రాష్ట్రంలో ఎక్కడికక్కడ ప్రజలే అన్య మత ప్రచారాన్ని అడ్డుకుంటున్న తీరు వారికి ఆనందాన్ని కూడా కలిగిస్తూ ఉంది. అలాంటి సంఘటనలలో కొన్ని...

## గిరిజన గ్రామం పాలుట్లలో...

కొందరు వ్యక్తులు తమ గ్రామంలో అన్యమత ప్రచారం నిర్వహించడానికి ప్రయత్నించగా వారిని ఆ గ్రామస్తులు తీవ్రంగా ప్రతిఘటించి వెనక్కు తిప్పి పంపిన ఘటన నల్లమల అటవీ ప్రాంతంలోని గిరిజన గ్రామమైన పాలుట్లలో చోటు చేసుకుంది. ఆదివారం సాయంత్రం ఓ వాహనంలో వచ్చిన సుమారు 20 మంది వ్యక్తులు పాలుట్ల గ్రామంలో ప్రార్థనా మందిరం నిర్మించి, ఏసయ్యను నమ్ముకుంటే పేదలకు సాయం చేస్తామంటూ ప్రచారం మొదలుపెట్టారు. దీన్ని గమనించిన గిరిజనులు వారిపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. “మీరు ఎక్కడి నుంచి వచ్చారు? మీ పేర్లు ఏమిటి?” అని గ్రామస్తులు ప్రశ్నించినా వివరాలు ఏమీ చెప్పకుండానే వారు వెళ్లిపోయారు. వన్యప్రాణి విభాగంలో కీలకమైన అటవీ ప్రాంతంలోకి ఏ అనుమతులూ లేకుండా ఎలా ప్రవేశించారని వారిని ప్రశ్నించామని ఆ గ్రామస్తుడు ఈదన్న పేర్కొన్నారు. దానికి కూడా ఏ సమాధానము ఇవ్వకుండా వారు తిరిగి వెళ్లిపోయారని ఆయన తెలిపారు. అనుమతులు లేకుండా వచ్చిన ఆ వ్యక్తులపై స్థానికులు అటవీ శాఖ అధికారులకు సమాచారం ఇచ్చారు. ఆ వ్యక్తులు తమ అనుమతి లేకుండానే అడవిలోకి వెళ్లారని గంజివారి పల్లె అటవీ క్షేత్రాధికారి నాగరాజా తెలిపారు. పాలుట్ల వాసులు ఇచ్చిన సమాచారంతో తాము బేస్ క్యాంపు సిబ్బందిని అప్రమత్తం చేశామని, వారి చర్యలపై విచారణ చేస్తామని తెలిపారు.

## అన్య మత ప్రచారకులకు అక్కడ నో ఎంట్రీ

మా గ్రామంలో ఉన్నవారంతా హిందువులే. ఇతర మతాలవారు మా గ్రామంలోకి ప్రవేశించి మత ప్రచారం చేస్తే వారిపై తగు చర్యలు తీసుకుంటాం” అని శ్రీకాకుళం జిల్లా నరసన్నపేట మండలం కరగాం పంచాయితీకి చెందిన నారాయణ వలస గ్రామస్తులు హెచ్చరిస్తున్నారు. ఈ మేరకు గ్రామ ముఖ ద్వారం వద్ద ఫ్లెక్సీని ఏర్పాటు చేశారు.

ఆ గ్రామంలో సుమారు 250 కుటుంబాలు నివసిస్తున్నాయి. గత 20 సంవత్సరాల నుంచి యువత, పెద్దలు భజనలు చేస్తూ హైందవ ధర్మాన్ని ఆచరిస్తున్నారు. చిన్న గ్రామమైనా నారాయణ వలసలో నాలుగు భజన బృందాలున్నాయి. తిరుమల తిరుపతి దేవస్థానం ప్రతి ఏటా నిర్వహించే బ్రహ్మోత్సవాలలో ఈ గ్రామానికి చెందిన భజన మండళ్ళు పాల్గొంటాయి. ఇటీవల అన్యమతస్తులు కొందరు తమ గ్రామంలో హిందువులకు వ్యతిరేకంగా ప్రచారం నిర్వహిస్తుండడంతోనే ఈ ఫ్లెక్సీని ఏర్పాటు చేసినట్లు గ్రామస్తులు ముక్తకంఠంతో చెబుతున్నారు. ఇతర మతాలవారు ఎవరైనా వచ్చి మత ప్రచారానికి, మతమార్పిడులకు పాల్పడితే వారిపై చర్యలు తప్పవని హెచ్చరిస్తున్నారు.

## మత మార్పిడి ముఠాల బారి నుంచి మమ్మల్ని రక్షించండి - తహశీల్దార్ కు గిరిజనుల వినతి

**తమ** గ్రామంలోకి క్రైస్తవ మత ప్రచారకులు ప్రవేశించి గిరిజనులను మత మార్పిడి చేయడానికి యత్నిస్తున్నారని, దానికోసం ఆకర్షణ సభలు ఏర్పాటు చేస్తున్నారని శ్రీకాకుళం జిల్లా మందస మండలంలోని కొండ లోగాం పంచాయితీ తెంతులిగాం గ్రామ గిరిజనులు మందస తహశీల్దార్ పివి శ్యామసుందర్ రావుకు వినతి పత్రం అందజేశారు. క్రైస్తవ మతంలో చేరకపోతే అంతు చూస్తామని గ్రామస్తులను వారంతా బెదిరిస్తున్నారని వారు తెలిపారు. తామంతా హిందువులమేనని, తమను క్రైస్తవ మత మార్పిడి ముఠాల బారి నుంచి రక్షించాలని ఆ గ్రామస్థులు తహశీల్దార్ ని కోరారు.

సవర ప్రకాష్, సవర శేఖర్, సవర రమేష్, సవర రంగయ్య, సవర బాలకృష్ణ, సవర కామేశ్వరరావు, సవర ధర్మ, సవర దాలయ్య వినతి పత్రం అందజేసిన వారిలో ఉన్నారు.

## పాఠకుల నగారా

అయోధ్య రామజన్మ భూమి కేసులో సాక్షాత్తు శ్రీ రామచంద్ర ప్రభువు తరపున కేసువాదించిన శ్రీ పరాశరన్ ను ఎంత అభినందించినా తక్కువే. ఆర్. ఎస్. ఎస్ అగ్ర నేతలు వారి ఇంటికి స్వయంగా వెళ్లి వారిని అభినందించడం ఆనందాన్ని కలిగించింది.

సయ్యద్ వసీం రిజ్వీ తమ పూర్వీకులు చేసిన తప్పులను సరిదిద్దుకోవలసిందిగా తన సహచర ముస్లింలకు చేసిన సూచన ఆహ్వానించదగినది.

ఆవు పిడకలకు అమెరికాలో కూడా గిరాకీ పెరుగుతోంది అంటే భారతీయతకు ప్రపంచవ్యాప్తంగా ఆదరణ లభిస్తోందనేగా?

రామజన్మభూమి కేసుకు డబ్బులు కావాల్సి వస్తే తన ఇంటినైనా అమ్మి ఇవ్వడానికి సిద్ధమని చెప్పిన శ్రీ జి. పుల్లారెడ్డి యావత్ హిందూ సమాజానికి ప్రేరణదాయకం.

ఇక సంపాదకుని నగరాలో ఆంధ్రప్రదేశ్లో జరుగుతున్న పరిణామాలు, ప్రభుత్వ తీరు తెన్నులు వివరించడం ద్వారా తెలుగు నేలపై హిందుత్వానికి పొంచి ఉన్న ప్రమాదాన్ని చెప్పకనే చెప్పారు.

నిరక్షరాస్యులైనా అతి చిన్న వయసులో పెద్ద మనసుతో ఆలోచించి దేశం కోసం ప్రాణాలర్పించిన బాజీ రౌత్, మరియు అతని స్నేహితులు నిత్య స్మరణీయులు.

మొత్తం మీద హిందూ నగారాలో వస్తున్న వార్తలు, వ్యాసాలు, విశేషాలు ఆలోచనాత్మకంగా, ప్రేరణాత్మకంగా ఉన్నాయి.

**– ఏదుళ్ళ ప్రసాద్, విజయవాడ.**

# బాల వికాసం ద్వారా కుటుంబ వికాసం

**రం**గయ్య ప్రక్క టౌన్లోని మార్కెట్లో మూటలు మోస్తాడు. బానే సంపాదిస్తాడు కూడా. కానీ స్నేహితులతో కలిసి మందు తాగటం అలవాటైంది. ప్రతిరోజూ తాగి ఇంటికి వచ్చేవాడు. తాగిన మైకంలో ఒక్కోసారి భార్యపైన, అప్పుడప్పుడూ పిల్లలపైన కూడా చేయి చేసుకుంటూ ఉండేవాడు. దాంతో పిల్లలకు, భార్యకు అతనంటే చాలా భయం. దగ్గరక్కూడా వచ్చేవారు కాదు.

ఎప్పటిలాగే ఆరోజూ తాగి ఇంటిగి వచ్చాడు. ఆదమరచి నిద్రపోయాడు. పొద్దున్నే తన కాళ్ళకు ఏదో తగిలినట్టనిపించింది. ఉలిక్కిపడి లేచాడు. ఎదురుగా తన కూతురూ, కొడుకూ స్కూలుకు వెళ్ళడానికి సిద్ధమై తన కాళ్ళకు నమస్కరిస్తున్నారు. మొదట ఏమీ అర్థం కాలేదు. అయోమయంగా భార్య వైపు చూశాడు. పిల్లలిద్దరూ స్కూలుకెళ్ళిపోయారు. "పిల్లలిద్దరూ సాయంత్రం గుడి దగ్గర జరిగే ప్రవేటుకెళుతున్నారుగా... అక్కడ పాఠాలు చెప్పే సరస్వతి చెప్పిందట "తల్లిదండ్రులు ప్రత్యక్ష దైవాలు. కనుక ప్రతిరోజూ ప్రొద్దున్నే తల్లిదండ్రుల పాదాలకు నమస్కరించాలి" అని. అందుకే ఇక నుంచి రోజూ మన పాదాలకు దణ్ణం పెట్టందే బడికి పోరట." అని ముసిముసిగా నవ్వుతూ చెప్పింది లక్ష్మి.

అలాగే రెండో రోజూ, మూడో రోజూ గడిచిపోయాయి. పిల్లలు రోజూ రంగయ్య, లక్ష్మి పాదాలకు నమస్కరిస్తున్నారు. ఇది చూస్తున్న రంగయ్యలో ఆలోచన మొదలైంది. "ఇలా కాళ్ళకు మొక్కించుకునే అర్హత నాకుందా? పిల్లలు దేవుని ప్రతిరూపాలు కదా? అలాంటి పిల్లల చేత రోజూ తాగొచ్చే నేను కాళ్ళకు మొక్కించుకోవడం ఏమిటి? ఛీ ఇక ఈ పాడు అలవాటు మానుకోవాలి." అనుకున్నాడు. ఇక ఆరోజు నుంచి మందు ముట్టడం మానేశాడు. రోజూ తన పనవగానే ఇంటికొచ్చి భార్యా పిల్లలతో ఎంచక్కా కబుర్లు చెబుతూ భోంచేసి నిద్రపోవడం మొదలైంది. "ఆహా ఎంత ఆనందకరమైన జీవితం? ఇన్నాళ్ళూ ఆ మందు మైకంలో పడి దూరం చేసుకున్నాను కదా?" అనుకున్నాడు రంగయ్య.

సమరసతా సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించబడుతున్న బాల వికాస కేంద్రాలలోని ఒకానొక కేంద్రంలో ఎదురైన అనుభవమిది. బాల వికాస కేంద్రాలు బాల బాలికలలో సంస్కార వికాసానికి ఎంతగానో దోహదపడుతున్నాయి. బాల వికాస కేంద్రాల కారణంగా పిల్లలలోనే కాక పెద్దలలో కూడా మార్పు సాధ్యమవుతోంది. పిల్లలలో వచ్చిన మార్పు కారణంగా, సంస్కారవంతమైన వారి ప్రవర్తన కారణంగా వారి తల్లిదండ్రులలో సైతం మార్పు వచ్చిన సందర్భాలు కోకొల్లలు. విడిపోయిన తల్లిదండ్రులను కూడా కలిపిన పిల్లలున్నారు.

ఏడాది క్రితం రాష్ట్ర వ్యాప్తంగా వివిధ గ్రామాలలో ప్రారంభమైన బాల వికాస కేంద్రాలలో పిల్లలకు చక్కగా చదువు చెప్పడం తోపాటు, వ్యాయామం, ఆట పాటలు కూడా నేర్పుతున్నారు. అంతేకాక అక్కడ చెప్పే చిన్న చిన్న కథల వల్ల పిల్లలకు దేశభక్తి అలవడడం తోపాటు, వ్యక్తిత్వ వికాసం కూడా కలుగుతోంది. పిల్లలు చక్కగా శుచి, శుభ్రత పాటిస్తున్నారు కూడా. దాంతో పెద్దలు కూడా వ్యసనాల నుంచి విముక్తమవటమే కాక, శుచి, శుభ్రత పాటించటం మొదలైంది.

అలా పిల్లల వికాసానికే కాక పెద్దల వికాసానికి, మొత్తంగా కుటుంబ వికాసానికి దోహదపడుతున్న బాల వికాస కేంద్రాల వార్షికోత్సవాలు రాష్ట్రమంతటా అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి.



*నంద్యాలలో...*



*మదనపల్లిలో...*



*నెల్లూరులో...*

★

Postal Registration No:VJ/152/2020-22 RNI No. 52882/93
Date of Printing : 28-12-2019-Date of Posting : 06-01-2020 - Pages: 8

# రాష్ట్రమంతటా కాషాయ జెండా రెపరెపలు





రాష్ట్రీయ స్వయంసేవక సంఘ్ తన కార్య విస్తరణ కోసం వివిధ కార్యక్రమాలు చేపడుతూ ఉంటుంది. ఈ ఏడాది అనేక క్రొత్త మండలాలు, గ్రామాలలో సంఘ శాఖల ప్రారంభానికి ఆర్. ఎస్. ఎస్ ప్రయత్నిస్తోంది. ఆర్. ఎస్. ఎస్ తన పని సౌలభ్యం దృష్ట్యా మన రాష్ట్రంలోని 13 రెవెన్యూ జిల్లాలను 31 సంఘ జిల్లాలుగా (ఒక్కొక్క రెవెన్యూ జిల్లాను 2- 4 సంఘ జిల్లాలుగా) విభజించుకున్నది. అలాగే ప్రతి రెవెన్యూ మండలాన్నీ 2 లేదా 3 సంఘ మండలాలుగా విభజించుకుంది. ప్రతి సంఘ మండల పరిధిలోనూ 5 నుంచి 8 గ్రామాలు ఉంటాయి. తన కార్య విస్తరణలో భాగంగా 2019 డిసెంబర్ 1న ప్రతి సంఘ మండల కేంద్రంలోనూ ఆ సంఘ మండలంలోని అన్ని గ్రామాల నుంచి కొందరు స్వయంసేవకులతో రాష్ట్రమంతా ఒకే సమయంలో సాంఘీక్ జరపాలని ఆర్. ఎస్. ఎస్ పెద్దలు నిర్ణయించారు.

పెద్దలు సూచించిందే తడవుగా కార్యకర్తలు రాష్ట్రంలోని గ్రామ గ్రామాన్ని పర్యటించారు. స్వయంసేవకులకి సమాచారం అందించారు. గతంలో సంఘ శాఖలు లేని గ్రామాలకు, కొంతకాలం శాఖ జరిగి ఆగిన గ్రామాలకు కార్యకర్తలు చేరుకొని అక్కడి వారిని సమీకరించి, సమాయత్తం చేసి డిసెంబర్ 1 సాయంత్రం 4 -6 గంటల మధ్యలో రాష్ట్రంలోని 1859 సంఘ మండలాలకు గానూ 1809 మండల కేంద్రాలలో సాంఘీక్ లు నిర్వహించారు. రాష్ట్రం మొత్తంలో గల 13052 గ్రామాలకు గానూ 4783 గ్రామాల నుంచి స్వయంసేవకులు సాంఘీక్ లలో పాల్గొన్నారు. దీంతో రాష్ట్రంలోని 1809 కేంద్రాలలో ఒకేరోజు ఒకే సమయంలో కాషాయ ధ్వజాలు రెపరెపలాడాయి.

ఈ సాంఘీక్ లలో మొత్తం 12,243 మంది విద్యార్థులు పాల్గొనగా 29,666 మంది వివిధ వృత్తుల వారు పాల్గొన్నారు. ఆ విధంగా మొత్తం 41,909 మంది ఈ కార్యక్రమాలలో పాల్గొన్నారు. ఈ సాంఘీక్‌ల నిర్వహణలో 5,317 మంది పాలు పంచుకోవడం విశేషం. వీటిలో 34 సాంఘీక్ లలో 100 మందికి పైగా స్వయంసేవకులు పాల్గొన్నారు. అలాగే ఈ సందర్భంగా 748 మండలాలలోని 2943 మంది స్వయంసేవకులకు క్రొత్తగా వివిధ బాధ్యతలు ప్రకటించారు.

అన్ని చోట్లా స్వయంసేవకులు ఉత్సాహంగా ఆయా సాంఘీక్‌లలో పాల్గొన్నారు. బాల్యంలో, యవ్వనంలో శాఖకు వచ్చి ఆనక మళ్ళీ ఇప్పుడు ఈ సాంఘీక్ కు వచ్చిన పెద్దలెందరో తమ చిన్న నాటి జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. ★

చందాదారులుగా చేరండి! చేర్పించండి
హిందూనగారా సంవత్సర చందా రూ.50
మీతో పాటుగా మరి కొంతమందిని
చందాదారులుగా చేర్పించండి.
SBI PrajasakthiNagar, VJA
SB A/C No. 10032482732
IFSC Code : SBIN0007899
పంపవలసిన చిరునామా
మేనేజర్
హిందూనగారా
మాధవసదన్, కాళేశ్వరరావు రోడ్,
విజయవాడ-520002.

Published and owned by : Tulasi Surya Prakash, and published from Madhavasadan, Kaleswara Rao Road, Governerpet, Vijayawada - 520002 and Printer Chiruvolu Vasudeva Rao and Printed at Vanaja Graphics, 33-21-13/A, Sitharampuram, Vijayawada-2. Editor- Chiruvolu Vasu Deva Rao. Ph: 9490923439